క్లుప్తంగా

10నుంచి శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్: శ్రీక్రోధి నామ సంవత్సరం చైత్ర శుద్ధి పాడ్యమిని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీన ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శ్రీరామ సేవా మండలి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు పేర్కొన్నారు.శనివారం స్థానిక రాంబొట్ల ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం, 10 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి పండితులతో శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమం, 17వ తేదీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామకృష్ణ, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ ప్రభు, ధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ శ్రీమహాలక్ష్మి, బి.శ్రీరాములు, ఆరవీటి రమేష్, కృష్ణ కాంత్, శ్రీనివాసులు,జెట్టి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

13న సీతారాముల కల్యాణ మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఈనెల 13వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈనెల 11 వతేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక గోశాలలో తలంబ్రాల సేవ, 12వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి వార్లకు తిరుమంజన సేవ, 13వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కర్నూలు మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటల నుంచి ధార్మిక ప్రవచనం, 7 గంటలకు సీతారాముల కల్యాణ వేడుక జరుగుతుందని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత ప్రవచనకారులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు ఉపన్యసిస్తారని తెలిపారు.

13న లేజర్ రన్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 13 న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మోడరన్ పెంటాథ్లాన్‌లో లేజర్ రన్ (రన్ షూట్ రన్) సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ మాస్టర్స్ బాల బాలికలు, స్త్రీ,పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయి టోర్నమెంట్ -కమ్- ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మోడరన్ పెంటాథ్లాన్ జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 8 వ రాష్ట్ర స్థాయి లేజర్ రన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 93984-22533 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తున్న సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్‌ని గెలిపించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కోరారు. శనివారం 51వ వార్డు పరిధిలోని కొత్తపేటలో సీపీఎం అభ్యర్థి విజయం కోసం ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యకరమంలో నాయకులు అనీఫ్, రామన్న, రాఘవేంద్ర, గోవర్ధన్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

కర్నూలు(సెంట్రల్): గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి అన్ని రాజకీయపార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర సమితి గౌరవాధ్యక్షుడు కె.రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకల పెంపకందారులు ఎంతో మంది ఆర్థిక ఇబ్బందులో ఉన్నారన్నారు. జీవాల కొనుగోలుకు 90 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలన్నారు.

మతోన్మాదులను ఓడించండి

కర్నూలు(సెంట్రల్): మత సామరస్యాన్ని కాపాడేందుకు మతోన్మాదులకు ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ ముస్లింలకు పిలుపునిచ్చారు. శనివారం ఎంఎస్ ఫంక్షన్ హాలులో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలతో ఆయన మాట్లాడారు.

నేడు విద్యుత్ అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతున్నందున నేటి (ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. పవర్ హౌస్‌స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహణ పనులు చేపట్టలేకపోయామని తెలిపారు. నేడు ఆ పనులు చేపడుతున్నందున పెద్ద మార్కెట్, ఖల్లా, కడక్‌పురా, బెంగళూరు ఎంపోరియం, ఎర్రబురుజు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆరోగ్యమస్తు!

- అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- ఆ దిశగా విప్లవాత్మక అడుగులు
- 108, 104, 102, ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్యశ్రీ పథకాలతో ప్రజలకు వైద్యసేవలు
- చికిత్సతో పాటు నివారణ వైపూ మొగ్గు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినం

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కల్తీ ఆహారం, పంటల్లో క్రిమిసంహారక మందుల వాడకం పెరగడం తదితర కారణాలతో మనిషికి వ్యాధులు చుట్టుముట్టుతున్నాయి.కొందరికి చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బులొస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఎవరైనా ఆరోగ్యంగా ఉంటే అదే రూ.పదికోట్లు అని భావిస్తున్నారు. నేడు (ఆదివారం) ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఏరియా ఆసుపత్రి, రెండు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇవి గాక కొత్తగా మరో 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లాలో మంజూరయ్యాయి. వీటితో పాటు ఐదు రక్త నిల్వ కేంద్రాలు, ఏడు బ్లడ్ బ్యాంకులు జిల్లాలో ఉన్నాయి. జిల్లాలో గత సంవత్సరం 44,685 మంది గర్భిణులు నమోదు చేసుకోగా కాగా (91.12శాతం), అందులో 40,971 మంది ఆసుపత్రుల్లో ప్రసవించారు. జిల్లాలో చిన్నారులకు 39,866 బీసీజీ, 39,109 ఓపీవీ, 37,587 హెపటైటిస్ బి, 46,296 ఓపీవీ 3వ డోసు, 46,437 పెంటావాలెంట్ 3వ డోసు, 46,148 ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. జాతీయ క్షయ నివారణ సేవల్లో భాగంగా గత సంవత్సరం 9,274 మందికి గళ్ల పరీక్షలు చేయగా 748 మందికి క్షయ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. జాతీయ కుష్ఠు నివారణలో భాగంగా 2,500 మందికి పరీక్షలు నిర్వహించగా 209 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జిల్లాలో 108 ద్వారా అంబులెన్స్ వైద్యసేవలు, 104 ద్వారా ఊళ్లోకే సంచార వాహన వైద్యసేవలు, 102 ద్వారా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు (గర్భిణిని ఇంటి వద్దకు దింపే కార్యక్రమం) దిగ్విజయంగా కొనసాగుతోంది. దాదాపుగా ప్రతి మండలానికి ఒక వాహనం లెక్కన వాహనాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు కొనసాగిస్తున్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో...

అసంక్రమిత వ్యాధుల నమోదులో భాగంగా 20,17,200 మందికి హెల్త్ ఐడీలు జనరేట్ చేయగా అందులో 60,405 మందికి రక్తపోటు, 44,893 మందికి మధుమేహం, 66 మందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. వీటితో పాటు 42,893 మంది వయోవృద్ధులకు వైద్యసేవలు అందించారు. 12,636 మందికి ఫ్లోరోస్ పరీక్షలు నిర్వహించగా 363 మందికి లక్షణాలు బయటపడ్డాయి.

సీజనల్ వ్యాధులు అరికట్టడంలో...

జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా 71,262 మందికి రక్తపరీక్షలు చేయగా ఒకరికి చికున్‌గున్యా, ఒకరికి మెదడువాపు, 71 మందికి డెంగీ నిర్ధారణ అయ్యింది. రక్తహీనత నివారణ సేవల్లో భాగంగా 2,27,877 మంది బడిపిల్లలకు, 1,52,235 మంది అంగన్‌వాడీ పిల్లలకు ఐరన్ మాత్రలు ఇచ్చారు. 6,29,147 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.



108 అంబులెన్స్‌లో వైద్యసేవలు



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సురక్షితంగా బాలింతను ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

అందరికీ కంటి వెలుగు

డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 4,351 పాఠశాలల్లో 6,73,728 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 37,329 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 14,525 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 164 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. వీరితో పాటు 2,06,989 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించగా 35,786 మందికి దృష్టిలోపాలున్నట్లు గుర్తించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 47,536 మందికి క్యాటరాక్ట్(కంటిశుక్లము) శస్త్రచికిత్సలు నిర్వహించారు.

ఇంటివద్దకే వైద్యం

ఫ్యామిలి ఫిజీషియన్ విధానం ద్వారా గ్రామాల్లో నిర్దేశించిన దినాల్లో నెలలో రెండుసార్లు వైద్యాధికారులు ఆరోగ్య సంచార యూనిట్(104) ద్వారా 25 మండలాల్లోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోకి వెళ్లి సేవలందిస్తున్నారు. ఇందులో మొత్తం 67 రకాలైన మందులు ఇవ్వడంతో పాటు 67 రకాల పరికరాలతో వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న చిన్న వ్యాధులకు అక్కడే వైద్యం చేస్తున్నారు. దీంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రామ్ ద్వారా గ్రామాలు, వార్డుల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు ప్రాథమిక వ్యాధులన్నింటినీ వడబోసి చికిత్స చేస్తున్నారు. పెద్ద వ్యాధులేమైనా ఉంటే జిల్లా కేంద్రంలోని ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 325 వైద్యశిబిరాలు నిర్వహించగా 1,13,632 మందికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోగులను రెఫర్ చేసి చికిత్సలు అందించారు.

గ్రామాల్లో టెలిమెడిసిన్

ఎక్కడో గ్రామాల్లో ఉన్న ప్రజలు జిల్లా కేంద్రాలకు వచ్చి వైద్యసేవలు అందుకునే అవసరం లేకుండా వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, పీహెచ్‌సీల్లోనే టెలిమెడిసిన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో టెలిమెడిసిన్ హబ్‌ను ఏర్పాటు చేసి అక్కడ స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. వీరు హెల్త్‌క్లినిక్, పీహెచ్‌సీల నుంచి వచ్చే టెలికాల్స్‌కు టెలిఫోన్, వీడియో కాల్స్ ద్వారా సమాధానాలు ఇస్తూ అక్కడి నుంచే రోగులకు ఆన్‌లైన్ వైద్యం అందిస్తున్నారు.

ప్రాణాలు పోస్తున్న ఆరోగ్యశ్రీ

జేబులో రూపాయి లేని వారు కూడా ఆరోగ్యశ్రీ కార్డు వెంట పెట్టుకుని వెళితే ఎంత పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి అయినా ఉచితంగా వైద్యం అందిస్తున్నా రు. జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆరంభం నుంచి 6,06,270 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.1,416.77కోట్లు ప్రజలు లబ్ధిపొందారు. గత ఆరు నెలల్లో 48,255 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.112.56కోట్ల లబ్ధి చేకూరింది.

వ్యాధుల నివారణే ప్రధానం



దీర్ఘకాలిక వ్యాధులు, కోవిడ్ లాంటి వైరస్‌లు మన దరి చేరకుండా ఉండాలంటే మన ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. వ్యాధులు వస్తే చికిత్స తీసుకోవడం ఎంత ముఖ్యమో అవి రాకుండా నివారణ పద్ధతులు పాటించడం అంతే ప్రధానం. బద్ధకం వల్ల వ్యాయామం, నడక చేయలేకపోవడం వల్ల ఊబకాయం, బద్ధకం, నీరసం వంటి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ కనీసం ఒక గంటపాటు వ్యాయామం చేయాలి.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్ఓ, కర్నూలు

ఆరోగ్యకర అలవాట్లు అలవర్చుకోవాలి



ఈ వేసవిలో అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి. ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. మామిడి పండ్లను మోతాదుకు మించి తినకూడదు. సురక్షితమైన తాగునీటిని తాగాలి. స్వచ్ఛమైన గాలి, మంచి పోషకాహారం, నాణ్యమైన ఇంటి వాతావరణం, పర్యావరణ పరిస్థితులను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి మన నాణ్యమైన జీవన విధానానికి తోడ్పడతాయి.

–డాక్టర్ వై. దివ్యలత, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

వైఎస్సార్‌సీపీలోనే వెనుకబడిన వర్గాలకు పదవులు

కర్నూలు(అర్బన్): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి పదవులు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని జిల్లా శ్రీ భగీరథ సగర/ ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు బి. సత్యన్న అన్నారు. అందుకు పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన శనివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా సిట్రా సత్యనారాయణమ్మను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు.

విధుల నుంచి మినహాయించాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల నుంచి వికలాంగులు, పదవీ విరమణకు దగ్గర ఉన్న వారిని, గర్భిణులు, చంటి బిడ్డలుగా ఉన్న మహిళా ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.రామశేషయ్య కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన డీఆర్వో కె.మధుసూదన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్

కర్నూలు (హాస్పిటల్) : పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. జాతీయ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ సైక్లింగ్-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్లబ్ కర్నూలు అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

మోసం చేసేందుకే పొత్తులు



ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ప్రజలు నమ్మరు
- మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మరోసారి ప్రజలను మోసం చేసేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా కూటమిని ప్రజల నమ్మరన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 41వ వార్డులో స్థానిక కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.అనంతరం కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. దీంతో లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారని పేర్కొన్నారు. మరింత మంచి జరగాలంటే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని చంద్రబాబు ఏ ఒక్క విభజన హామీ సాధించలేదన్నారు. ఈ విషయం ప్రజలకు గుర్తుందని వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

- కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మతో కలిసి 25 వ వార్డులో ఎన్నికల ప్రచారం



జొహరాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇంతియాజ్

కర్నూలు (టౌన్): ముచ్చటగా మూడోసారి కర్నూలు నగరంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేద్దామని ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి స్థానిక 25వ వార్డులో పార్టీ జిల్లా అధ్యక్షురాలు, స్థానిక కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేవనగర్, గాయత్రీ ఎస్టేట్ తదితర కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. స్థానిక వ్యాపారులను కలిసి అండగా నిలబడాలని కోరారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు జగనన్న చేపట్టిన ఇంటింటి సంక్షేమం, అభివృద్ధికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్నారు. కర్నూలు నగరం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి పెట్టని కోట లాంటిదన్నారు. ఈసారి తనకు అవకాశం ఇస్తే ప్రణాళిక ప్రకారం నగర అభివృద్ధి చేపడతానన్నారు. పరిపాలనలో తనకున్న అనుభవంతో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సి.హెచ్. మద్దయ్య, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్ నాథ్, చెన్నమ్మ, సుచరిత, రమేష్, ఇబ్రహీం, వెంకటేష్, విజయ్, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4వవార్డు జిందాబాద్ మసీదులో...

4 వ వార్డు గనీగల్లీ జిందాబాదు మసీదులో ఇంతియాజ్ ముస్లింలతో కలిసి ఇఫ్తారు విందులో పాల్గొన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ జుబేర్ అహమ్మద్, క్లస్టర్ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, చున్నుభయ్య, రి యాజ్ పాల్గొన్నారు. అలాగే 25 వ వార్డులోని కోట్ల రైల్వే స్టేషన్ సమీపంలోని సల్మాన్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్‌విందులోనూ ఇంతియాజ్ పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగం వైద్యులకు అరుదైన శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శనివారం ఆ విభాగ వైద్యులతో ఆరోగ్యశ్రీతో పాటు పలు విషయాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గైనిక్ విభాగంలో ఆరోగ్య శ్రీ కేసుల నెలవారీ లక్ష్యాలను పెంచుతున్నట్లు తెలిపారు. ఇక్కడి కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడే వైద్యపరీక్షలు, చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీని ఆదేశించారు. హాజరుపట్టీలో వైద్యులు సంతకాలు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సావిత్రి పాల్గొన్నారు.

హౌస్ సర్జన్లు గుర్తింపు కార్డు ధరించాలి

ఆసుపత్రిలో విధుల్లో ఉన్నప్పుడు హౌస్‌సర్జన్లు తప్పనిసరిగా గుర్తింపుకార్డు, డ్రెస్ కోడ్ ధరించాలని, బయోమెట్రిక్ హాజరు, రిజిస్టర్‌లో సంతకం తప్పనిసరిగా చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజిలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో హౌస్‌సర్జన్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌస్‌సర్జన్లకు విధి విధానాల గురించి జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాలో సెబ్ అధికారుల హస్తం!

- పంచలింగాల వద్ద 240 మద్యం బాక్సుల స్వాధీనం
- దర్యాప్తు చేపట్టిన ఎస్పీ

కర్నూలు: తెలంగాణ నుంచి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, మైదుకూరుకు ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు పట్టుకున్నారు. మద్యం అక్రమ రవాణాల్లో ఆ జిల్లాకు చెందిన సెబ్ అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి కర్నూలు సెబ్ పోలీసులు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. అలంపూర్ వైపు నుంచి కర్నూలు వస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. అందులో 240 మద్యం బాక్సులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ బాషాను అదుపులోకి తీసుకుని విచారించగా కడప జిల్లా ప్రొద్దుటూరు, మైదుకూరుకు మద్యం తరలిస్తున్నట్లు తెలిసింది. వాహనాన్ని సెబ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో కడప సెబ్ అధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. సెబ్ సీఐలకు ఫోన్ పే ద్వారా నగదు పంపిణీ చేసినట్లు గుర్తించారు. కర్నూలు ఎస్పీ దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటోలో మద్యం పట్టివేత

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లేదారిలో గాయత్రి భారత్ పెట్రోలియం బంక్ ఎదురుగా ట్రాలీ ఆటోలో 3,168 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో టమాటా క్రేట్స్ బరువు కన్నా అధికంగా ఉండటం, వాహనానికి ఉండాల్సిన రంగును మార్చడంతో అనుమానించి పోలీసులు సోదా చేయగా... ప్రత్యేక అరలో 33 కార్టూన్ బాక్స్‌ల మద్యం కనిపించింది. రాయచూరు జిల్లా కడగం దొడ్డి గ్రామానికి చెందిన హరీష్‌గౌడ్ అనే వ్యక్తి అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. మద్యం విలువ దాదాపు రూ.2లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్, హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, విరూపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి పోషకాహారం అవసరం

కర్నూలు(హాస్పిటల్): తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన బుధవారపేటలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి బి. లక్ష్మి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందజేయాలి

కర్నూలు (టౌన్): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12లో వివరాలను పూరించి ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల విధుల్లో ఉండే ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ ఆఫీసర్లు, అలాగే భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ రోజున తమ సాధారణ విధులు నిర్వహించనున్న 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఆందోళన చెందకండి.. అండగా ఉంటా

కర్నూలు సిటీ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సి.బెళగల్ మండలం బ్యాతోలి గ్రామానికి చెందిన దేవరాజును వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ శనివారం పరామర్శించారు. డాక్టర్లతో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యమందించాలని కోరారు. అధైర్య పడకండి.. అండగా ఉంటానని ఈ సందర్భంగా దేవరాజ్ కుటుంబసభ్యులకు సతీష్ భరోసా ఇచ్చారు.

12న మాదిగల సింహ గర్జన



కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 12వ తేదీన నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో జై భీం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల సింహ గర్జన సభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ నాయకులు సంధ్య విక్రమ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ మాజీ సభ్యులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ మూడు దశాబ్దాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేస్తున్నా, పాలక పార్టీలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.